సీతారాముల ననుసరించి అరణ్యములో నివసించినది మొదలు లక్ష్మణుఁడు ఇతరప్రపంచమును విస్మరించినాఁడు. అతని దృష్టికి కనుపించినది ఇద్దఱే-అన్నగారు, వదినెగారును. అతఁడు చేయఁబూనినది వారిసేవ ఒక్కటే. నిద్రను సహితము అరికట్టి వారిపాదములనే కొలచినాఁడు. ఈ తీరుగా దీక్షతో పదునాలుగు సంవత్సరములు గడపినాఁడు. నేఁటికి పూజ్యురాలైన వదినెగారి పుణ్యమున ఊర్మిళ చెంతకు వచ్చు భాగ్యము కలిగినది. ఆత్మేశ్వరిని చూడఁగనే లక్ష్మణుని బుద్ధికి వికాసము, దేహమునకు ప్రకాశమును కలిగినవి. సుషుప్తిలో నున్న కాంతకు సంభ్రమముతో తనను ఎఱుక పఱచు కొన్నాఁడు.

లక్ష్మ:— శ్రీరాము తమ్ముండనే-
ఊర్మి:— అతడనగ-సృష్టిలో నొకరు గలరా?
లక్ష్మ:— జనకు నల్లుడ గానటే-
ఊర్మి:— భూమిలో-జనకులనగా నెవ్వరు?
లక్ష్మ:— పుడమినుండీ బుట్టినా-సీతకూ-ముద్దు మరదిని గానటే!
ఊర్మి:— సీతయనగా నెవ్వరూ-భూమిలో-సృష్టియనగా నెరుగనా?

లక్ష్మ:— నెలత యూర్మిళవందురే-నీపేరు-నిక్కమూ దాచెదేల?
శ్రీరాము నెడబాసియూ-అక్కడా-సీతమ్మ చెరబోయెనూ
కేలిమ్ము ఇందువదనా-లోకాప-కీర్తికే లోనౌదునూ
సీత మరదిని గానటే చేడెరో-చేరిదయనేలుకోవే